# రాత

చెరువు గట్టు మీద నడుస్తున్నారు... పార్వతీ, కళావతీ ఇద్దరే.

ప్రశాంతంగా ఉంది ఆ సాయంత్రం.

చుట్టూరా ఉన్న పొలాలు పేదగా ఉన్నాయి. ఏ పంటలూ లేవు. కను చూపుమేర ఈ పొలాలే. మధ్య మధ్య చిన్న చిన్న ఊళ్లు కన్పిస్తున్నాయి. అక్కడా అక్కడా చెదురు మదురుగా మర్రిచెట్లూ, వేపచెట్లూ, తాటిచెట్లూ, ఈతచెట్లూ...

పార్వతి హైస్కూల్‌లో కొత్తగా నెలదినాల క్రిందటే బి.ఇడి టీచర్‌గా చేరింది. కళావతి విద్యార్థిని. పదకొండో తరగతి. చూట్టానికి వాళ్లు గురుశిష్యుల్లా కాక స్నేహితుల్లాగ కన్పిస్తారు. అయిదారేళ్ల వయో భేదమంతే. కళావతి పొడవైన అమ్మాయి. పార్వతి ఎత్తే.

పార్వతి ఏడెనిమిదేళ్ల చిన్న వయసులో సీమలో రెండేళ్లకు పైగానే ఉన్నారు. పార్వతి నాన్నగారు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్. తర్వాత ఆయన డెప్యూటీతాహసీల్దార్ అయ్యాడు. తహసీల్దార్ అయ్యాడు. ఇప్పుడు రిటైర్ అయ్యారు. విశాఖపట్నంలో మొదట పిల్లల చదువు కోసం అద్దెఇళ్లల్లో ఉన్నారు. ఇప్పుడు స్వంత ఇల్లు కట్టించుకుని ఉంటున్నారు. తమ్ముడి చదువు పూర్తికావటానికి ఇంకా రెండేళ్లు

పట్టేట్టుంది.

పార్వతి పెద్దన్నయ్య హైదరాబాద్‌లో ఉన్నాడు. ఎజి ఆఫీస్‌లో ఉద్యోగం. చిన్నన్నయ్య ఒరిస్సాలోని జాజ్‌పూర్ కాలేజీలో ఇంగ్లీష్ లెక్చరర్. కాని వాళ్లకు వాళ్ల సంసారాలు ఈడ్చుకోవటంతోనే సరిపోతుంది. నాన్నగారికి వస్తున్న పెన్షన్ బొత్తిగా సరిపోదు. అసలే చిన్నఇల్లు. అయినా ఒకభాగం అద్దెకిచ్చారు. కొడుకులను అడగటం ఆయనకి ఇష్టంలేదు. పెళ్లివయసు, పెళ్లి అని డిగ్రీతో పార్వతి చదువు ఆగిపోయింది. సుమారు మూడేళ్లు వృధాగా ఇంట్లో కూర్చుని చివరకు తనకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తి కోసం బి.ఇడి ట్రైనింగ్‌లో చేరింది. వెంటనే ఉద్యోగం దొరికింది. పట్టణంలో బ్రతుకు పార్వతికి యాంత్రికం అన్పించింది. తనను ఎవరూ ఎరగని ఏ పల్లెటూరుకన్నా దూరంగా పారిపోవాలనిపించేది. ఆమె కోరుకున్నట్టుగానే ఈ ఊళ్లో పార్వతికి ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు పార్వతికి ఎంతో సంతోషంగా ఉంది.

నాలుగయిదేళ్లే అయింది కొత్తగా ఆ ఊళ్లో హైస్కూల్ వచ్చి. ఆ దగ్గర గ్రామంలోని ఎమ్.బి.బి.ఎస్ డాక్టర్ పూనికతో పెట్టారు. స్కూల్ బిల్డింగ్స్ ముచ్చటగా మూడు కట్టారు. పెద్ద ఆటస్థలం ఉంది. టీచర్స్ కోసం ఇతర సిబ్బంది కోసం పదివాటాలతో స్కూల్ దగ్గర్లో ఓ తోటలో క్వార్టర్స్ కట్టారు. ఉన్నంతలో ఆ స్కూల్ గురుకులాశ్రమాన్ని తలపించేట్టుగా ఉంటుంది.

ఆ స్కూల్ హెడ్మాష్టర్ గాంధేయవాది. అతడు నిజజీవితంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకే కాకుండా ఆ చుట్టుప్రక్కల గ్రామాలప్రజలకు, విద్యార్థుల తల్లి తండ్రులకు ఆదర్శప్రాయుడు అయ్యాడు.

ఈ వాతావరణం అంతా పార్వతి అభిరుచికి నచ్చింది. భగవంతుడు తనకు ఒక వరం ఇచ్చినట్టు ఆమె భావించింది. స్వంత వంట. ఆడపిల్లలు వచ్చి ఆమెకు తోడుగా ఉంటారు. వాళ్లు పాటలు పాడతారు. కళావతి పల్లెపాటలు బాగా పాడుతుంది. ఆమె గొంతుకూడా బాగా ఉంటుంది.

పార్వతి పాడుతుంది... సంగీత జ్ఞానం ఉందని తెలుసుకున్న హెడ్మాష్టర్ ఈ సారి పాఠశాల వార్షికోత్సవాలకి బృందగానం, జానపదనృత్య కార్యక్రమాలు చేర్చాలని ఇప్పటినుండే శిక్షణ మొదలు పెట్టించారు.

పార్వతీ కళావతీ ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ గట్లదారిన నడుస్తున్నారు.

పార్వతికి కృష్ణప్ప గుర్తుకు వస్తున్నాడు.

ఈ ఊరు వచ్చిన రోజు నుండి పార్వతికి సీమ వెళ్లి చూడాలనిపించింది. ఆ ఊరే కళావతిది. అందుకే ఇవాళ అటువెళ్లి రావాలనుకుంది. దగ్గరే. రెండు కిలో

మీటర్లలోపే. నడిచే వెళ్లాలి. అది పొలాల్లోంచి కాలిబాటలోనే.

కళావతి క్లాసులో తెలివైన పిల్ల. వాళ్ల నాన్నగారు చాలా కాలం టాటానగర్ ఉక్కు కర్మాగారంలో పనిచేశారు. అక్కడే పుట్టి అక్కడే పెరిగింది కళావతి. అందుకే ఆ అమ్మాయికి హిందీలో, ఇంగ్లీషులో ఫస్ట్‌మార్క్‌లు వస్తున్నాయి. పైగా నగర నాజూకు తనం తెలిసిన పిల్ల. 'మీ ఊరు చూడాలని ఉంది. వస్తా' అని చెప్పింది ఆ అమ్మాయితో పార్వతి. 'రండి మేడమ్' అని ఆ అమ్మాయి పిలుస్తూనే ఉంది. 'వస్తాను. ఇవాళ. రేపు. సెలవు రోజున. అయ్యో ఈరోజు కూడా వెళ్లలేకపోతున్నానే' అని అనుకుంటూ, బాధపడుతూ ఉండగానే నెలదినాలు గడచిపోయాయి.

చివరికి ఈనాటికి కుదిరింది.

ప్రకృతి అందాలు కొత్తగా ఉన్నాయి. లోకం విశాలంగా ఉంది. చలికాలమే అయినా వెచ్చగా ఉంది. సూర్యాస్తమయ తేజస్సు ఆహ్లాదంగా ఉంది. దాంతో మనసు ఉత్సాహంగా ఉంది. స్వేచ్ఛగా ఉంది పార్వతికి.

సీమలో ఆమె బాల్యం రంగురంగుల బొమ్మల్లాగా కండ్లముందు కదలాడింది. ఆ ఊళ్లో ఓ బడి ఉండేది. ఆ బడిలో చదువుకుంది. అయిదు తరగతులకు ఒక్కడే ఉపాధ్యాయుడు. ఒకే గది. అయదు తరగతుల పిల్లలు ఆ గదిలోనే కూర్చునేవాళ్లు. అందరికీ సరిపడే బెంచీలు ఉండేవి. అయితే ఆ ఉపాధ్యాయుడు రెండు తరగతుల పిల్లలని ఆటలు ఆడుకోవటానికి విడిచి పెట్టేవాడు. మరో రెండు తరగతుల పిల్లలను బైట కూర్చోబెట్టి ఎక్కాలు కంఠతా పెట్టించటం, వరవడి రాయించటం వంటి పనులు చేయించేవాడు. తను పాఠం చెప్పే పిల్లల్ని మాత్రం గదిలో ఉంచేవాడు. చాలాసార్లు కథలు చెప్పేవాడు. పాటలు పాడించే వాడు. పద్యాలు పిల్లలతో పాడించేవాడు. అప్పుడు పిల్లలంతా కలిసే ఉండేవారు. నిజానికి తనకు పాటల పట్ల అభిరుచి కలిగింది అక్కడే. పిల్లలతో పాటు ఆయన ఆడుకునే వాడు. ఎప్పుడూ ఎవ్వరినీ కొట్టేవాడు కాదు.

తన ఈడు పిల్లలందరితో గాలితనంతో ఆడుకునేది. పాడుకునేది. ఎవరికీ చిక్కకుండా పరుగులు తీసేది. ఇల్లూ, వాకిలీ, తల్లీ, తండ్రీ, అన్నీ మరచిపోయేది. కృష్ణప్ప, సాంబయ్య, లోలాక్షి, సావిత్రి, రమణ, రంగన్న, రాజు, శ్రీలక్ష్మి, అనూరాధ ఆ పేర్లన్నీ ఇంకా పార్వతికి గుర్తు. వాళ్లంతా ఇప్పుడు ఏం చేస్తున్నారో. పెళ్లిళ్లు వాళ్లకు చిన్న వయస్సులోనే జరిగి ఉంటాయి. పిల్లలతో కాపురాలు చేస్తుంటారు. అయినా వాళ్లు ఈ ఊళ్లో ఉంటారా? ఏమో కన్న వారింటికి చూట్టానికి వచ్చి తనకు తారస పడవచ్చు కదా. సాంబయ్య, రంగన్న, రాజు మగవాళ్లు కదా. వాళ్లు ఉండవచ్చు.

వాళ్లూ ఉద్యోగాలకోసం ఊరు విడిచి వెళ్లిపోయారా? కళావతిని పార్వతి అడిగింది. వాళ్ల గురించి కళావతి చెప్పలేకపోయింది.

పార్వతికి ఆ ఊళ్లోని పాఠశాల మేష్టరుగారు గుర్తొచ్చారు. ఆయన అంటే చాలా ఇష్టం. తమ ఇంటికి వచ్చి, న్యూస్ పేపర్ చదువుకునే వాడు. ఇప్పుడు అన్పిస్తున్నది ఉపాధ్యాయవృత్తి అంటే ఆసక్తి కలగటానికి ఆ మేష్టరుగారే కారణమేమో! బి.ఇడిలో పిల్లల మనస్తత్త్వశాస్త్రం బోధిస్తారు. అంతశ్చేతనలో మరుగున పడిఉండిపోయిన ఆ మేష్టరుగారి మీద అభిమానమే ఈ వృత్తిని తాను ఎంచుకోవటానికి కారణమేమో!

ఆ మేష్టరుగారు ఇప్పుడు లేరట. ఉద్యోగం విడిచిపెట్టి మళ్లీ కాలేజీలో చేరాడని మాత్రమే ఆయన గురించి ఊళ్లో చెప్పుకుంటూ ఉంటారని కళావతి చెప్పింది.

ఆ స్నేహితులు తనని ఒక్క నిమిషం వదిలే వాళ్లు కాదు. ఆటలే ఆటలు. ఆ ఊరుకు ఉత్తరంగా పెద్ద కోనేరు ఉండేది. దాని ఉత్తరపు గట్టుమీద పెద్దరావి చెట్టు. ఆ చెట్టుకింద ఆంజనేయస్వామి గుడి. ఆ గుడిముందు మండపం. ఆ రావిచెట్టు నీడలోనే ఆటలన్నీ. సెలవురోజుల్లో రోజు రోజంతా అక్కడే గడచిపోయేది. భోజనాల వేళకు గురయ్య వచ్చి తనను ఎత్తుకుపోయేవాడు. ఎండల్లో, వానల్లో, చలిలో ఆటలేమిటని అమ్మా, అన్నయ్యా కోప్పడేవాళ్లు.

కోనేటిలో మగపిల్లలూ ఆడపిల్లలూ అంతా ఆడుకుంటున్నారు. పార్వతికి నీళ్లు అంటే భయం. ఒడ్డున కూర్చుని చూసేది. కొందరు అలసిపోయి స్నానాలు పూర్తి చేసి ఒడ్డుకు వచ్చేవారు. కొందరు బట్టలు మార్చుకుని ఇళ్లకు వెళ్లి పోయేవారు. మిట్ట మధ్యాహ్నపు వేళ. ఆ రోజు అంతా వెళ్లిపోయారు.

కృష్ణప్ప ఇంకా చెరువులోనే ఉన్నాడు.

తనను భయపెట్టడం కృష్ణప్పకు సరదా. రొమ్ములోతు నీటిలో ఉన్నాడు. ఇంకా ఇంకా లోపలికి పోతాడు. వద్దనేది తను. వద్దన్న కొద్దీ లోపలికి వెళ్లేవాడు. ఈత రాదు. పైగా కోనేరు నిండా ఉంది. తను భయంతో కంటనీరు పెట్టుకునేది. కృష్ణప్ప బయటకు వచ్చేవాడు. తను మాట్లాడేది కాదు. బతిమాలేవాడు. బాధ పడేవాడు. రావిచెట్టు వేరుమీద కూర్చుని ఎదురుచూసేవాడు.

ఆ రోజు ----

కృష్ణప్ప ఇంకా లోతుకు వెళ్లాడు. ఇంకా... ఇంకా...

కృష్ణప్ప మునిగి పోయాడు.

పెద్దలెవ్వరూ లేరు. భయంతో కేకేసింది. అరచింది పెద్దగా. ఎవరూ కనబడలేదు. చుట్టూ చూసింది. మునుగుతూ తేలుతూ...

మునిగిపోయాడు కృష్ణప్ప.

తర్వాత ఎంతకూ తేలలేదు. మరింక కన్పించలేదు. కృష్ణప్పే కాదు పద్మాలకోనేరుకూడా కన్పించలేదు. కోనేరు గట్టుమీది ఆంజనేయస్వామి గుడికాని, పైన కొమ్మలు చాచిన రావిచెట్టుకాని, చుట్టూ పెరిగిన పచ్చని పూలమొక్కలుకాని, నీలాకాశంకాని, ఏమీ కన్పించలేదు.తర్వాత కనిపించిందల్లా తమ ఇంటిపైకప్పూ, మంచానికి అంటుకున్న తనూ.

కృష్ణప్ప చనిపోయాడు!

సరి, ఆ రోజునించి తనని బైట అడుగు పెట్టనివ్వలేదు. ఆ మంచమే తన పంజరం అయిపోయింది. బయటకు వెళ్లటానికి భయం.

కృష్ణప్ప తర్వాత కలలో కనబడేవాడు. ఆ కలలన్నీ గుర్తుండేవి కావు. ఒక్కటి మాత్రం బాగా గుర్తుండిపోయింది.

గురయ్య వస్తున్నాడు. గుడిలో ఆంజనేయస్వామి విగ్రహం వెనక ఇద్దరూ దాక్కున్నారు. గురయ్యకు కనిపించకుండా తప్పించుకోవాలని. ఒకరి కళ్లల్లోకి ఒకరు చూసుకుంటూ. గురయ్య అడుగుల చప్పుడు పసిగడుతూ. గురయ్య లోపలికి వచ్చి కనిపెట్టి కృష్ణప్పను తిట్టి తనను ఎత్తుకుని పోబోతే తన్నింది. అమ్మ నిద్రనించి లేపి 'ఏమిటే అట్లా తన్నుతున్నావ్?' అని అంది.

తర్వాత రెండు నెలలకే నాన్నగారికి ప్రొమోషన్ మీద బదిలీ అయింది. ఆ ఊర్నించి వెళ్లిపోయారు.

నది చూసినా, చెరువుచూసినా, సముద్రం చూసినా కృష్ణప్పే గుర్తొచ్చేవాడు. పదేళ్ల వయసులో, వెడల్పాటి ముఖంతో, పొడుగాటి ముక్కుతో, గుండ్రటి కండ్లతో, విశాలమైన నుదురుతో, కండ్లమీద పడే జుత్తుతో, వివేకమైన చూపుతో, ఆగని కెరటాల్లాంటి నవ్వుతో కృష్ణప్పే కనబడేవాడు. ఏ ఊరు వెళ్లినా, అక్కడి చెరువు, అక్కడి వాగు, అక్కడి నది...

కళావతి అమాయకమైన కబుర్లేవో చెపుతూనే ఉంది. పార్వతి యధాలాపంగా ఊకొట్టుతూనే ఉంది. కాని తన స్వంతమైన ఊహల్లో ఎక్కడో ఉంది.

పార్వతి ఆ స్కూల్లో టీచర్‌గా చేరిన తర్వాత ఆ బడిలో ఆడపిల్లలందరికీ ఎంతో గర్వం అనిపించింది. ఆ ఆడపిల్లలు తామూ తరగతి గదుల్లో మగపిల్లల ముందు నుంచుని పాఠాలు బోధిస్తున్నట్టు ఊహించుకోసాగారు. ఆ ఆడపిల్లలకు పార్వతితో చనువు పెరిగింది. పార్వతి వాళ్లకు కొత్త కొత్త ముచ్చట్లు చెప్పేది. పాటలు పాడించేది. పుస్తకాలు చదివించేది. ఆటలు ఆడించేది. అక్కడ స్కూల్‌లో ఇతర

ఉపాధ్యాయులు కూడా ఉంటున్నారు. చాలమంది చిన్న వయసువాళ్లే. ఇద్దరు ముగ్గురు బ్రహ్మచారులు కూడా ఉన్నారు. పెళ్లయిన ఉపాధ్యాయులు —— వాళ్ల భార్యలు —— పార్వతి వద్దకు వచ్చి ఆమెతో గడిపేవారు. మా ఇంటికి రండి మేడమ్ మా ఇంటికి అని తీసుకుపోయేవారు. ఒక్కోసారి వాళ్లకు మేడమ్ ఎందుకు పెళ్లి చేసుకోలేదో అని సందేహం కలిగేది. అయితే టీచర్‌ని అడిగే ధైర్యం లేదు. అంత చనువూ లేదు. పైగా పార్వతి స్వంత విషయాల ప్రస్తావన తెచ్చేది కాదు. ఆమె గంభీరంగా హుందాగా ఉండేది.

ఓ రోజు సరస్వతి అడగనే అడిగింది. సందర్భం అనుకూలించింది. సావిత్రి, మేడమ్‌తో 'కళావతికి పెళ్లి సంబంధాలు వస్తున్నాయి మేడమ్. వాళ్ల అమ్మగారేమో పెళ్లి చేసేయాలని తొందర చేస్తున్నది' అని.

'అయితే కళావతీ, ఇంక నీ చదువులింతేనా?' అని పార్వతి అడిగింది. కళావతి క్లాసులో తెలివైన పిల్ల. అట్లాంటి పిల్లలు పైచదువులు చదువుకోవాలి. పై చదువులలో రాణిస్తుంది. కొన్నిసార్లు ఆ చదువే ఆమెకి మంచి యోగ్యుడైన విద్యావంతుడైన వరుడుని తెచ్చి పెట్టుందేమో. ఈ అభిప్రాయాలు పార్వతి పైకి చెప్పకపోయినా క్లాసులో పాఠాలలో, ముచ్చట్లలో, ఆడపిల్లలు పెళ్లిళ్లు ఎట్టిపరిస్థితిలోనూ పద్దెనిమిదేళ్లలోపు చేసుకోకూడదని, ఇష్టపడిన వరుడు తారసపడినప్పుడే చేసుకోవాలని, కట్నాలు కావాలని కోరేవాళ్లను దూరంగా ఉంచాలని తన స్నేహితురాళ్ల అనుభవాలు జతచేసి కథలుగా చెప్పేది.

'చేసుకోను మేడమ్. ఇష్టంలేదు మేడమ్. నేను కాలేజీలో చేరి చదువుకుంటాను మేడమ్. పెళ్లి నాకు ఇష్టం లేదు' అంది కళావతి.

'ఏం ఎందుకని?' పార్వతి అడగటం అదును తీసుకుని ——

'మీరు ఇంత పెద్దవాళ్లు కదా, ఎందుకు చేసుకోరు మేడమ్?' అని సరస్వతి అడగనే అడిగింది.

ఇంకొకరయితే ఆ అమాయకమైన ప్రశ్నను తప్పించుకోలేరు. పార్వతి తన సహజమయిన గంభీరతతో 'పిచ్చి ప్రశ్న' అని నవ్వేసింది. పిల్లలతో మాట్లాడే సంగతి కాదది. అదే ప్రశ్నని హెడ్మాష్టరు గారి భార్య సరోజినీ దేవి అడిగారు. పార్వతికి ఇరుకున పెట్టినట్టయింది. కాని తెలివిగా 'వివాహయోగం రావాలి కదండీ' అని నవ్వేసింది. అయితే అంతా విన్న హెడ్మాష్టరు గారు 'ఇప్పుడు వచ్చిందేమో' అని ఆమె జాతకం అడిగారు. ఆయనకు పెళ్లిళ్ల ముహూర్తాలు పెట్టటం, జాతకాలు చూడటం వంశపారంపర్యంగా అబ్బిన విద్య. అది ఇప్పుడు హాబీ. అందుచేత పార్వతి కోసం

ఇప్పుడాయన వరాన్వేషణ చేస్తున్నారు. దానికి కారణం పార్వతి అంటే అభిమానం.

జాజ్‌పూర్ స్మృతి...

తూర్పు కనుమల్లోపల ఉందా ఊరు. అడవులు, కొండలు, పొలాలు, వాగులూ వర్షాకాలం వెల్లింది ఆ ఊరు. అమాయకమైన పల్లెటూరు జనం. ఒరియా భాష. చాలామంది తెలుగుకూడా మాట్లాడుతారు. తోటలో ఓ చిన్న పెంకుటింట్లో చిన్నన్నయ్య ఉండేవాడు. తనని రమ్మని రాశాడు. తమ్ముడ్ని వెంట బెట్టుకుని వెళ్లింది. అక్కడ మిత్రా పరిచయం. ఆ కాలేజీలో మేథ్స్ లెక్చరర్. కొరాపుట్ ప్రాంతీయుడు. అతడు మూడు భాషలలో ప్రవీణుడు. తెలుగు చదువుతాడు. సంగీతం ఇష్టం. జయదేవుని అష్టపదులు పాడేవాడు. త్యాగరాజ కృతులు నేర్చుకున్నాడు. ఎప్పుడు మాట్లాడినా సంగీతమే. రబీంద్ర సంగీతాన్ని గురించి తనకు చెప్పింది మిత్రాయే. పండిట్ రవిశంకర్, బిస్మిల్లా ఖాన్, భీమ్‌సేన్ జోషీ ---- మొదటిసారి మిత్రా నోటి వెంటే వింది ఆ పేర్లు.

సరిగ్గా అదేరోజుల్లో బి.ఇడి అడ్మిషన్. దాంతో అక్కడనుండి వెళ్లిపోయింది.

'మళ్లీ కనిపించవా పార్వతీ' అని అడిగాడు మిత్రా, తాను వెళ్లిపోతున్నట్టు తెలిసి.

ఈ మధ్య అన్నయ్య వచ్చినప్పుడు మిత్రా గురించి అడిగితే ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉద్యోగం వచ్చి వెళ్లిపోయాడు. ఐ.ఎ.ఎస్. పరీక్ష రాయాలని అతడి ఉద్దేశం... అని చెప్పాడు.

ఎక్కడో ఓ కొమ్మమీద నిట్టూర్చిందో పిట్ట.

కాలిబాట మలుపు తిరిగింది. మొగలి పొదల ప్రక్కనుండి నడుస్తున్నారు.

మిత్రా ఇప్పటికీ గుర్తు. కులాలు పట్టింపులు ఉన్న తల్లిదండ్రులు. తల్లి తండ్రులు ససేమిరా ఒప్పుకోరు. పైగా మిత్రా తనని చెల్లెలుగానే చూశాడు. అతడంటే గౌరవభావం ఏర్పడిపోయింది. అట్లాంటివాళ్లు చాలా అరుదు.

సుందర్రావు...

పెద్దన్నయ్యా వదినా సంక్రాంతికి వచ్చినప్పుడు తమతో హైదరాబాద్ తీసుకుని వెళ్లారు. ఖైరతాబాద్‌లో ఉండేవాళ్లు. మేడమీద వాటా. రెండో వాటాలో సుందర్రావు పరిచయమయ్యాడు. పేరున్న చిత్రకారుడు. పెళ్లి అయింది. ఇంకా పిల్లలు కలుగలేదు. అతడి భార్య శారద. అంత అందమైన యువతిని చూడటం అదే తొలిసారి అన్పించింది. దేవకన్యలు అంటారు కదా. అట్లా ఉండేది. సుందర్రావు కేన్వాస్ మీద రంగులు పరచుకుంటూ ఉంటే చూసేది. అక్కడి నుండి కదల్లేకపోయేది. దాంతో ప్రతిరాయీ అహల్యలా కనబడసాగింది. అతడి స్టూడియో

గదిలో శిల్పాలు కూడా ఉన్నాయి. బహుశా అతడి చేతి స్పర్శకు శిలలే ప్రాణం పోసుకున్నాయో ఏమో. 'అక్కకి అహల్య అని పేరు పెట్తే బావుండేది' అంది తను సుందర్రావుతో.

ఓ ఉదయం అన్నయ్యా, వదినా బాల్కనీలో కూర్చుని టీ తాగుతూ ఉండగా వచ్చి నాకో చిత్రం బహూకరించాడు. ఇది నీ పుట్టిన్రోజు కానుక అన్నాడు. నా చిత్రమే. చిన్నదే. పదిహేను బై పద్దెనిమిది అంగుళాలు. కేన్వాస్. తైల వర్ణచిత్రం. ఆవేళ నా పుట్టిన్రోజు అని కూడా గుర్తులేదు నాకు. పుట్టిన్రోజులు చేసుకునే అలవాటు మా ఇంట్లో లేదు. ఆ చిత్రాన్ని చూసినప్పుడు నేను ఉప్పొంగిపోయాను. పుట్టినరోజు శుభాకాంక్షలు అని చెప్పి ఒక నవ్వు నవ్వి వెళ్లిపోయాడు.

పెళ్లయిన వాడని తెలిసి కూడా సుందర్రావు అంటే మనసు పడింది. అభిమానం ఏర్పడింది.

అట్లాంటివాడు జీవితంలో తనకు లభిస్తాడా?

సీమకి దగ్గరయ్యారు. ఆ ఊళ్లోకి వెళ్లాలంటే కోనేరు గట్టు మీదినించే పోవాలి. ఆంజనేయస్వామి గుడీ, పచ్చని కొమ్మలతో రావిచెట్టూ కన్పిస్తున్నాయి. తన పాత స్నేహితుల్లో కొందరన్నా తనని గుర్తుపట్టారో లేదో చూడాలి. కళావతి ఇంట్లో చెప్పలేదు మేడమ్ ఇవాళ వస్తున్నట్టు. సరే ఇవేళ వస్తా పద అని పార్వతి బయల్దేరింది. అర్ధగంట నడక. తిరిగి చీకటి పడేలోగా వెనక్కి వచ్చేయాలి.

తను పెళ్లిచేసుకుంటే ఈ స్వాతంత్ర్యం తనకు ఉంటుందా? తనను ఉద్యోగం చేసుకోనిస్తారా అత్తవారు? నాన్నకు పైసలు పంపనిస్తారా? తను సంపాదించుకున్న పైసలతో తనకు కావలసిన వాటిని కొనుక్కోనిస్తారా?

తల్లిదండ్రులు కుదిర్చే సంబంధాల విషయంలో పార్వతి తన అయిష్టాన్ని స్పష్టంగా చెప్పేసింది. తల్లితో పోట్లాట పెట్టుకుంది. అయితే తండ్రి తన తరఫున నిలబడ్డాడు. పెద్ద వదిన తనని సమర్థించింది.

జీవితంలో పెళ్లి అవసరం అన్పించినప్పుడు, అన్నీ అనుకూలించినప్పుడు..

అది జరుగుతుంది.

జీవితంలో గడ్డు సమస్యలు ఎదురై వేదనకు గురైనప్పుడు 'బహుశా భవిష్యత్తులో మంచి జరగవచ్చు. అంతా మన మంచికే' అని పెద్దలు చెప్తారు కదా అన్పించింది. భానుమతి పెళ్లయి రెండేళ్లు కూడా నిండక ముందే భర్తను కోల్పోయినప్పుడు, సుశీల గర్భంలో బిడ్డతో ఆస్పత్రిలో చనిపోయినప్పుడు, యామిని నిప్పంటించుకుని కాలిపోయినప్పుడు పార్వతికి పెళ్లి అంటే భయం ఏర్పడిపోయింది. అట్లాగే తన

బంధువులే, స్నేహితురాళ్లే పెళ్లి తర్వాత సంసారాలతో, పిల్లలతో సంతోషంగా ఉన్నవాళ్లు కూడా ఉన్నారు. 'ఆత్మహత్య చేసుకుని చచ్చిపోతానే పార్వతి' అన్న రేణుక ఇప్పుడు 'నేను చాలా అదృష్టవంతురాలిని. భగవంతుడు నన్ను చల్లగా చూస్తున్నాడు' అంటున్నది. వయసు ముదిరితే ఆడపిల్లకు పెళ్లి కష్టం. జాగ్రత్త అని తనను హెచ్చరిస్తున్నది సుమతి.

ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టు అన్పిస్తున్నది. నిరాశల నిప్పుల మీంచి నడుస్తున్న సమయంలో రేపు మంచి జరుగుతుంది అనే ఆశల వర్షం ఎంతో ఓదార్పు నిచ్చేది.

ఆశా నిరాశలు రెండు కళ్లు. రెండు కళ్లతో చూస్తే ఆనందం, ప్రేమ, తృప్తి, మమత, కరుణ —— అంతా సౌందర్యమయంగానే కన్పిస్తాయి. కొన్నిసార్లు ఇవన్నీ కేవలం కల్పితాల్లాగా, ఒత్తి భ్రమల్లాగా అన్పిస్తాయి.

యామిని ఎందుకు ఆత్మ హత్యకు పాల్పడిందో పార్వతికి అర్థం కాదు. పూజించే మనుషులే తర్వాత ఎందుకు శపిస్తారో తెలీదు. వెన్నెల్లా కన్పించే చందమామే అంతలో నిప్పులు ఎందుకు కక్కుతాడో తెలీదు. భానుమతి బతుకు ఇప్పుడేమవుతుంది? భానుమతి ఆ దు:ఖం నించి కోలుకుంటుందా? ఆమెని ఎవరన్నా సహృదయుడు ఆదుకుంటాడా?

మనసు ఆలోచనలతో బరువుగా ఉంది.

కోనేరు గట్టు. రావిచెట్టు. ఆంజనేయ స్వామి గుడి.

ఏమీ మార్పులేదు. పదిహేనేళ్ల కిందట ఉన్నట్టే ఉన్నాయి. తనని వెంటనే గుర్తుపట్టి పలకరిస్తున్నాయి.

పార్వతి ఆంజనేయస్వామిని నమస్కరించింది. అంతలోనే ఆమెకు కోనేరులో కాళ్లు కడుక్కుని స్వామిని నమస్కరించాలనిపించింది. వెళ్లి కాళ్లు కడుక్కుంటూ ఉంటే ఆ నీళ్లల్లో కృష్ణప్ప కన్పించసాగాడు. కృష్ణప్ప ఇప్పుడు తామరపువ్వు అయిపోయినట్టున్నాడు. తామరపూలతో ఆకులతో కొలను నిండిపోయింది. కళావతి ముచ్చట్లు... ప్రతి పండగకీ ముందు వేకువజామునే ఈ కోనేరులోనే స్నానాలు, ప్రార్థనలు చేస్తారట జనం.

వచ్చి గుడిలోకి వెళ్లి ఆంజనేయస్వామిని మనసారా ప్రార్థించింది. ఆ విగ్రహం వెనక కృష్ణప్ప కనిపించసాగాడు. కళ్లు విప్పితే స్వామి. ఆ సింధూరం తీసి నుదుట పెట్టుకుంది.

ఊళ్లోకి వచ్చారు.

తనకు తెలిసిన ఊరు కాదది. అస్థి పంజరంలా ఉంది ఊరు. తనకు తెలిసిన ఊరు కళకళ్లాడుతూ ఉండేది. ఇళ్లు చాలా వరకు కూలిపోయి మట్టి గోడలు కనబడుతున్నాయి. మగ్గాలమోత విన్పించటం లేదు. చేనేత పని వాళ్లతో వీధులు, ఇళ్లు నిండుగా ఉండేవి. ఇది తాను చిన్నప్పుడు పెరిగిన ఊరేనా అన్న సందేహానికి గురి చేసింది. ఇది సీమేనా? ఏమయింది?

తమ ఇంటికి ఎదురుగా కన్నప్ప నాన్నమ్మ వాళ్ల ఇల్లు ఉండేది. ఆ ఊళ్లో అదే పెద్ద ఇల్లు. చాలా ఆవులూ, గేదెలూ ఉండేవి. తనని ఎంతోముద్దు చేసేది. వెన్న పెట్టేది. సీతమ్మత్త వాళ్ల ఇంటికి తీసుకు వెళ్లి పళ్లు ఇచ్చేది. మిఠాయి పెట్టేది. అనూ వాళ్ల పెద్దక్క తాము బదిలీ అయి వెళ్లి పోతుంటే కంటనీరు పెట్టి ఏడ్చేసింది. వెళ్లిపోయేనాటికి పోట్లాట మూలంగా రమణతో మాటల్లేవు. ఇప్పుడుందా? కన్పిస్తే మాట్లాడాలి. గుర్తుపట్టుందా? ఎక్కడుందో?

వాళ్లంతా, తనతో ఆడుకున్న తన నేస్తాలు. వాళ్లంతా కన్పిస్తారా?

ఆ ఊళ్లో చెట్లూ, కోనేరూ, ఆంజనేయస్వామి గుడీ, రావి చెట్టూ, ఆ పొలాలూ పేరు పెట్టి పిలిస్తే ప్రతిదీ నువ్వా పార్వతీ వచ్చావా అని గుర్తు పట్టి వచ్చి కావలించుకోవాల్సిందే. అలాంటిది, అంతా మూగిగా, శాపగ్రస్తంగా ఉండటం బాధ అన్పించింది.

'అదే మా ఇల్లు మేడమ్'

పార్వతి చూసింది.

ఆ ఇంట్లోనే తాము అద్దెకు ఉండేవాళ్లు. ఆ ఊళ్లోని నాలుగయిదు పెంకుటిళ్లల్లో అదొకటి. ఆ ఇంటి యజమాని అప్పుడు టాటానగర్‌లో ఉండేవాడు. ఆయనే కళావతి తండ్రి. కళావతి అన్నలు ఇప్పటికీ టాటా నగర్‌లోనే ఉద్యోగాలు చేసుకుంటున్నారు.

ఆ ఇల్లు... పెరట్లో తులసికోట ఉంటుంది. బావి ఉంటుంది. మామిడి చెట్లు ఉంటాయి. బొప్పాయి చెట్లు, దానిమ్మ మొక్కలు, సంపంగి చెట్టు ఉంటాయి.

కళావతి తలిదండ్రులు, అక్క ఎంతో ప్రేమతో పలకరించారు. వాళ్లకు సంతోషమే కాదు గర్వంగా కూడా ఉంది. ఇంటి ఆడపడుచు వచ్చినట్టు సంబరపడిపోయారు. ఇంట్లో అంతా తన కోసమే ఎదురు చూస్తున్నట్టు కన్పించారు.

పార్వతికి కాళ్లు కడుక్కోవటానికి నీళ్లిచ్చారు. ఆమె కాళ్లు కడుక్కున్న తర్వాత లోపలికి తీసుకుపోయారు. లోపల ఓ కుర్చీ ఉంది. ఆ కుర్చీలో పార్వతిని కూర్చో బెట్టారు.

'నాన్నగారు ఈ ఊళ్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా చేస్తున్నప్పుడు దాదాపు మూడేళ్లు

మీ ఇంట్లోనే ఉన్నాం.'

'ఇది ఇప్పుడు కూడా మీ ఇల్లేనమ్మా' అన్నారు కళావతి నాన్నగారు.

ఉయ్యాల్లోని పాప ఏడుపు విని కళావతి అక్క పాపను తీసుకుని వచ్చింది.

పార్వతి పాపను ఎత్తుకోవాలనిపించి చేతులు చాచింది.

'నీవు కూర్చున్న కుర్చీ ఎవరిదో తెలుసా అమ్మాయీ' అడిగింది కళావతి తల్లి.

చిత్రంగా చూసింది ఆ పాతకాలపు నగిషీలు చెక్కిన కుర్చీని. స్కూల్‌లో హెడ్మాష్టరు కూర్చునే కుర్చీలా ఉంది. అయితే ఈ కుర్చీ చాలా చాలా పూర్వకాలం నాటిదిలా అన్పించింది.

'మీ నాన్నగారు బదిలీ అయివెళ్లిపోయినప్పుడు ఈ కుర్చీ ఇక్కడ విడిచిపెట్టేశారు. అదే...'

ఎంత కృతజ్ఞతా భావం వాళ్లకు!

'రా అమ్మాయీ రా లోపలికి' అని కళావతి తల్లి పార్వతిని లోపలి గదిలోకి తీసుకుపోయింది. తనకు చిరపరిచితమైన ఇల్లు. ఒక్కసారి పార్వతికి తాను ఏడెనిమిదేళ్ల పాప అయిపోయినట్టూ, ఆ ఇంట్లో పరుగులు పెట్టున్నట్టు అన్పించింది.

పార్వతిని కుర్చీలో కూర్చోబెట్టి కళావతి తండ్రి ఆమెకు ఎదురుగా నేలమీద కూర్చున్నాడు. ఇంకో ఇద్దరు ముగ్గురు ఇరుగుపొరుగు ఆడవాళ్లు వచ్చారు.

నాన్న గురించి అడిగారు. అమ్మ గురించి అడిగారు. అన్నయ్యలు వాళ్ల ఉద్యోగాలు వాళ్ల సంసారాలు ——

చివరకు పెళ్లి...

మాటలు మార్చేసింది పార్వతి.

లోలాక్షి గురించి అడిగింది. ఆనాటి స్నేహితులను పేరు పేరునా అడిగింది. వాళ్లు ఎవరూ లేరు. పొట్ట చేత్తో పట్టుకుని చెట్టుకో పిట్టలా వెళ్లిపోయారు. చేనేత కుటుంబాలు బెంగుళూరు చేరుకున్నాయి కొన్ని. కొందరు ఒరిస్సాలోని రూర్కెలా. మరికొందరు భిలాయ్... రిక్షావాళ్లుగా, రోజు కూలీలుగా, చిన్న వ్యాపారులుగా, చదువులు లేని కొలువుల్లో బతుకుతున్నారట.

చేనేత పరిశ్రమ దెబ్బతిన్న ఫలితం... ఆ గ్రామం శిధిలావస్థ!

రైతులు, గొర్రెలకాపర్లు, రైతు కూలీలతో మిగిలింది ఊరు.

కళావతి అక్క చేతిలోని పాప ముద్దులూరిస్తూ ఉంది. పార్వతి ఆ పాపను తీసుకుంది. ఇద్దరూ పెరట్లోకి వెళ్లారు.

పెరట్లో ఆ చెట్లు లేవు. ఆ చోటులో వంటగది, భోజనాల గది అదనంగా

కట్టించుకున్నారు. దృశ్యం మారిపోయింది.

కొద్ది నిమిషాలపాటు పాప తన దగ్గర ఉండి ఏడవటం మొదలు పెట్టింది. కళావతి అక్క పాపను తీసుకున్న తర్వాతగాని ఈ ఏడుపు తగ్గలేదు.

తల్లీ బిడ్డలు దృశ్యం పార్వతిని ఆకర్షించింది. కళ్లార్పకుండా చూసింది. మాతృత్వానుభూతి.

'అన్నీ వాళ్ల నాన్నగారి పోలికలే' పొగుడుతున్నది పాపని. భర్తని. ఆ తల్లి కళ్లలో పరవశానందం. గుండె నిండా తేనె నింపినట్టు ఒక మధురానుభూతి.

వాళ్లాయనకు రైల్వేలో ఉద్యోగమట. ఖుర్దారోడ్‌లో ఉంటున్నారట. ఆమె కాన్పుకోసం వచ్చి పదిమాసాలయిందంట! వారం దినాలలో అల్లుడు వచ్చి ఆమెను తీసుకుపోతున్నాడట.

కండ్లముందు మిత్రా, సుందరరావు కదిలారు. ప్రపంచంలో ఏ శక్తి ఈ అనురాగవల్లరులను పెంచి పోషిస్తున్నదో. మరుక్షణమే తుంచి వేస్తున్నదో. మట్టి బొమ్మను పట్టుకుని 'మాధవా మధవా' అని ప్రార్థించి పలక్కపోతే అమాయికమైన వేదనతో కృశించి పోతున్నదా? నిజంగా ప్రపంచంలో ఏమీ లేదేమో! అంతా కల్పితమేనేమో! ఆ కల్పితాల్లోనే ఈ లోకం ఇంత రుచి కాబోలు! లేకపోతే ఉన్నట్టే ఉండి, తన కళ్లల్లో కదిలి, ఊసులాడి, మళ్లీ మాయమై పోవడమేమిటి? ఈ ప్రేమాభిమానాలు ఎందుకు? తన చిన్ననాటి స్నేహితులంతా ఏమైపోయినారు. ఆ పెరట్లోని చెట్లన్నిటినీ ఎందుకు తీసేసినారు?

గతంలోని జీవితదృశ్యాలు అల్లుకున్నాయి. ప్రేమలు ముడులు పడ్డాయి. ఆమె మనసు పగిలిన అద్దంలో ప్రతిబింబాలయింది.

కళావతి తెలివైన పిల్ల అనీ, పై చదువులు చదివించండి అనీ ఆ ఇంట్లో వాళ్లకు చెప్పింది. చదువు పూర్తయ్యే వరకు పెళ్లి గురించి ప్రస్తావించ వద్దని చెప్పింది. ఆమెకి నచ్చినవాడితో పెళ్లి చెయ్యవచ్చు అంది. ఈ ఇల్లు చూడటం తనకు సంతోషంగా ఉందన్నది. కోనేరు, ఆంజనేయ స్వామి గుడి, రావిచెట్టూ ఏమీ మార్పుచెందలేదని అంది.

సాయంత్రం. రంగుల వర్షం కురుస్తున్నది.

తిరిగి తానుంటున్న స్కూల్ క్వార్టర్స్‌కి చేరుకోవాలి. వాళ్ల దగ్గర సెలవు తీసుకుని తిరుగుముఖం పట్టింది పార్వతి. ఇంటిల్లిపాది ఆమెను సాగనంపటానికి కోనేరు వరకు వచ్చారు.

చాలా రోజులు తర్వాత ఆ ఇంట్లో జున్ను తిన్నది. సపోటా పళ్లు, జీడిపప్పు.

అన్నీ వాళ్ల తోటలోవేనట. టాటానగర్ నించి స్వగ్రామం వచ్చేసిన తర్వాత వ్యవసాయం మీద దృష్టి పెట్టాడు కళావతి తండ్రి.

స్నేహాల పూల తోటలో విహరించాలని ఆశపడి వచ్చినట్టుంది పార్వతి. ఆ స్నేహితులు ఏ ఒక్కరూ కనిపించలేదు. దాంతో నీరసించిపోయింది.

'ఈ నూలు మిల్లులు, మిల్లుబట్టలు వచ్చిన తర్వాత సాలీల వృత్తి దెబ్బతిని, వాళ్లు అప్పులపాలయి, తిండి దొరక్క ఇల్లూ గట్రా అమ్మేసి భిలాయ్, రూర్కెలా, కలకత్తా, అస్సామ్ వెళ్లిపోయారు... మిగిలిన కుటుంబాల రైతులు... రైతు కూలీలు... గొర్రెలు మేకలు పెంచుకుంటున్న కుటుంబాలు —' అని గ్రామంలోని స్థితిగతుల గురించి కళావతి తండ్రి చెపుతున్నాడు.

కోనేరు గట్టుమీద గుడిలో ఆంజనేయస్వామిని చూసింది. పసుపుతో, సింధూరంతో అందంగా ఉన్నాడు స్వామి. తనను పదిహేనేళ్ల పూర్వం ఎట్లా చూసేవాడో ఇప్పుడూ అట్లానే చూస్తున్నాడు. తనను గుర్తు పట్టిన చూపు. పలకరించే ప్రేమ ఆ కళ్లల్లో. చేతులెత్తి వందనం చేసింది. స్వామి తనను గుర్తుపట్టినందుకు సంతోషం. భక్తితో ప్రణమిల్లింది.

అప్పుడే వచ్చిన గాలికెరటానికి రావిచెట్టు తనని చల్లగా ముద్దుపెట్టుకున్నట్టు అన్పించింది.

కోనేరు వేపు దృష్టి మళ్లింది. కోనేరు పిలుస్తున్నది. అలలు సైగచేసి...

కృష్ణప్ప... కృష్ణప్ప...

మునుగుతూ తేలుతూ... మునుగుతూ తేలుతూ...

దూదిపింజలా మనసు తేలిపోతున్నది.

అలసిపోయింది హృదయం. నరాలన్నీ తెగినతీగెల్లా వణికిపోతున్నాయి. తను నేలమీద పడిపోతున్నట్టు... రావిచెట్టు వేరుమీద కూర్చున్నది. కళ్లు తిరుగుతున్నట్టయి కళ్లు మూసుకున్నది.

కళావతి , కళావతి తండ్రి, కళావతి అక్క — విచిత్రంగా చూస్తున్నారు.

ఆ ఊరుతో ఆమెకు ఉన్న గాఢానుబంధం అట్లాంటిది అనుకుంటున్నారు వాళ్లు.

కళ్లు నెమ్మదిగా తెరచి పైకి చూసే సరికి గుడి గోడలమీద గీసిన బొమ్మలూ, అక్షరాలు కన్పించాయి. ఆ గుడి గోడలకి వెల్లవేసి ఒక తరం గడిచిపోయినట్టుంది. ఎత్తుగా కొమ్మకు ఆనుకుని ఉన్న గోపురం మీద 'పార్వతి' అన్న అక్షరాలు కన్పించాయి. కృష్ణప్ప ఒక వర్షం వెలిసిన రోజున కొమ్మమీద కూర్చుని చెక్కిన అక్షరాలవి.

'పార్వతి' అక్షరాలు యుగయుగాల నిరీక్షణతో చూస్తున్నట్టున్నాయి. అదృశ్యహస్తాలతో పిలుస్తున్నట్టున్నాయి. అనంతమైనఆవేదనతో ప్రార్థిస్తున్నట్టున్నాయి.

చీకటిపడేసరికి క్వార్టర్స్ చేరుకుంది పార్వతి. కళావతి నాన్న ఇంటివరకూ వచ్చి తిరిగి వెళ్లిపోయాడు.

కృష్ణప్ప ఏదో రూపంలో ఎక్కడో ఉన్నాడు...

* * *

*– ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక*

*11.1.1967*